


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**మధుర: సామాన్యమైన** ఓ పల్లెటూరి ఇల్లు. పెద్ద పెరడు. ఇంటిముందు బావీ, చెట్లూ, రామజోగి ధ్యానంలో ఉన్నాడు. మధుర అతనికేసి చూస్తోంది. మధురకి రామజోగి అంటే ప్రాణం. కానీ రామజోగి ఆలోచన ఏమిటో ఆమెకి అర్ధంకాదు. గంటముందు జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది మధురకి.

"రామా! నువ్వు నాతోనే ఉండిపో" రెండు చేతులూ పెనవేసి అన్నది మధుర.

"ఇప్పుడులేనా?" నవ్వాడు రామజోగి. కొంచెం సన్నగా పొడుగ్గా ఉండే రామజోగికీ, అతి తీక్షణంగా చూసే అతని కళ్ళకీ సంబంధమే లేదు. ఆ కళ్ళు గుండెలోతుల్లోకో, ఎదుటివారి గత జన్మల్లోకో చూస్తున్నట్టూ వుంటై. ఆ కళ్ళవంక చూస్తూ అబద్దం ఆడటం అసాధ్యం.

మళ్ళీ అదే రామజోగి నవ్వితే మరోలా ఉంటుంది. ఓ చిన్నపిల్లవాడు కొంటెగా నవ్వినట్టుంటుంది. కంటిచూపుకూడా అప్పుడు కొంటెదనంతో కవ్విస్తుంది.

అతని వయసు పాతికేళ్ళే అయినా, అతని మాటలు వేరేలా ఉంటాయి.

"ఉన్నావుగానీ లేనట్టనిపిస్తుంది" కళ్ళలోకి చూస్తూ అంది మధుర.

"అవును. ఉన్నది లేనట్టూ, లేనిది ఉన్నట్టూ అనిపించడం సహజం. మనోలక్షణమే అది"

"అంటే?"

"మనసు ఎక్కడో ఉంటే మనిషి ఉన్నా లేనట్టే మనిషి ఎక్కడున్నా 'మనసు' ఇక్కడుంటే మనిషి లేకపోయినా ఉన్నట్టే"

"అర్థంకాలేదు రామా.!"

"అన్నీ వెంటనే అర్థంకావు మధురా! సరే.. ఒకటి చెప్పు.. నేనిక్కడ లేనప్పుడు నీకేం అనిపిస్తుందీ?"

"చాలాసార్లు నువ్వు పక్కనున్నట్టే అనిపిస్తుంది. నువ్వు మాట్లాడినట్టు కూడా అనిపిస్తుంది. తరువాత అది భ్రాంతేమో అనుకుంటాను."

"ఇవాళ నేను రాకముందే నాకోసం నువ్వు వంటచేశావు కదూ" నవ్వాడు రామజోగి.

"అవునూ!" ఆశ్చర్యంగా అడిగింది. తనెందుకు అసలు వంటచేసింది?

"ఎందుకు చేశావూ?"

"ఏమో.. నువ్వు ఖచ్చితంగా వస్తావనిపించింది"

"ఎందుకలా అనిపించిందో తెలుసా? నేను నీ గురించే ఆలోచిస్తూ వస్తున్నానని నా మనసుతో కబురంపాను గనక" మళ్ళీ నవ్వాడు రామజోగి.

"నువ్వు ఆటపట్టిస్తున్నావు రామా!" వీపు మీద పిడికిళ్ళతో మెల్లగా కొట్టింది. నవ్వుతున్నవాడల్లా తటాల్న పక్కకి జరిగి గంభీరంగా,

"ఓహ్..! ఒక్క క్షణం.. నన్ను నా అంతట నేను లేచేదాకా కదపొద్దు" అంటూ గభాల్న క్రింద కూర్చుని ధ్యానముద్ర పట్టాడు రామజోగి. దాదాపు 20 నిముషాలు. కదలికలు లేవు. శ్వాస పీలుస్తున్న జాడకూడా లేదు. ఉన్నట్టుండి అరిచాడు, "ఆగు..!" అని.

రెండు నిముషాల తరువాత మెల్లగా కళ్ళు తెరిచి గాఢంగా నిట్టూర్చాడు.

"ఏమయింది రామా?" కంగారుగా అడిగింది మధుర.

"ఏమీ లేదు. ఇద్దరు అతిధులు వస్తున్నారు. భోజనం ఉంటుందా?"

"ఆ..! అన్నం మాత్రం వొండాలి. ఆధరువులు సరిపోతై."

"వొండు" అని వాకిట్లోకి వెళ్ళాడు రామజోగి.

"అయ్యా.. నా పేరు మట్టూ. పరమేశ్వరశర్మగారి శిష్యుడ్ని. మీరు కాపాడకపోతే ఎవరో ఒకరం యీ క్షణాల్లో మీ ముందు ఉండేవాళ్ళంకాదు." సాగిలపడి నమస్కరించి అన్నాడు మట్టు.

"లే మట్టూ లే" అతని తలనిమిరి అన్నాడు రామజోగి.

శృంగికి ఏమీ అర్థంకాలేదు.

"ఏమైంది గురూజీ? ఎందుకీ మట్టూ అలా అన్నాడు?" అయోమయంగా అన్నాడు శృంగి.

మట్టు ఏదో చెప్పబోతుంటే వద్దని వారించి, "శృంగీ, నువ్వెళ్ళి స్నానం చెయ్యి" అని ఆజ్ఞాపించాడు.

శృంగి అయిష్టంగానే లోపలికి వెళ్ళాడు.

"ఇప్పుడు చెప్పు" మట్టూ వంక చూసి అన్నాడు రామజోగి.

"అయ్యా.. మొదట ఒక్క సందేహం. అప్పుడొచ్చింది మీరేనా? మీరే కదూ"

"నేనా? నేనిక్కడే ఉన్నానుగా" నవ్వాడు రామజోగి.

"ఉహూ..! శృంగి స్పృహ తప్పి పడగానే ఆ పాము నోరు తెరిచి మీద పడబోయింది. ఒకే ఒక్క క్షణం. నేనో శృంగో దానికాటుకి గురికాక తప్పదనుకున్నాను. మీరే..'ఆగు' అంటూ దాని దృష్టి మరల్చారు. అది మీవైపు తిరిగింది. ఓ క్షణం మీ వైపు తీక్షణంగా చూసిందేమో. నాకు తెలియదు. పడగని ముడుచుకుని చరచరా దక్షిణం వైపుకి పాకుతూ వెళ్ళిపోయింది. మిమ్మల్ని నేను చూశాను. అది మాత్రం భ్రాంతి కాదు"

"పరమేశ్వరుడి శిష్యుడికి వివరాలు చెప్పాలా? మట్టూ, నువ్వు ఓ విధంగా అదృష్టవంతుడివి. ఆ మహా నాగు దర్శనమైంది. అది ఆగ్రహిస్తుందో అనుగ్రహిస్తుందో కాలమే నిర్ణయించాలి. అదిగో .. అక్కడి రాతి తొట్టిలో చల్లని నీరు వుంది. హాయిగా స్నానం చెయ్. బట్టలు ఉన్నై.. నీ స్నానం అయ్యేలోగా అవి తెచ్చి ఇస్తాను. కట్టుకుని హాయిగా భోజనం

చెయ్యి. ఈ రాత్రి ఇక్కడే విశ్రమించు. రేపటి సంగతి రేపు చూద్దాం" చిన్నగా నవ్వి వేపచెట్టుకింద వున్న తొట్టివంక చేయిచూపాడు రామజోగి.

"చిత్తం. తమ ఆజ్ఞ" అటువైపుకి నడిచాడు మట్టూ.

ఒక పంచ, ఓ కండువా, ఓ తువ్వాలూ తెచ్చి అరుగుమీద ఉంచాడు రామజోగి. శృంగి తలతుడుచుకుంటూ అరుగుమీదకి వచ్చాడు.

"వంట పూర్తికావొచ్చింది" లోపలనించి అన్నది మధుర.

"మంచిది" మళ్ళీ పద్మాసనంలో కూర్చున్నాడు రామజోగి.

"గురూజీ.. ఇవాళ ఓ పెద్ద ప్రమాదం తప్పింది. ఓ మహా సర్పం మమ్మల్ని దారిలో అడ్డగించింది. ఎంత పొడుగో. దాని పడగ ఎంత పెద్దదో. మింగేస్తుందనుకున్నాను. కళ్ళు తిరిగాయి. లేచి చూస్తే పాము పొదల్లోకి వెళ్ళిపోయిందని మట్టూ చెప్పాడు. అసలిక్కడికి రాననీ, నన్ను పల్లె మొదట్లో వదిలి పెట్టి వెళ్తాననీ అన్నవాడు, "మీ గురువుగారిని తప్పక దర్శించాలి" అంటూ, ఇంటిదాకా వచ్చాడు"

"రావలసిన పరిస్థితి ఏర్పడ్డప్పుడు రాక తప్పదుగా శృంగీ. ఇక జరిగినదాని గురించి ఆలోచించకు."

"అన్నట్టు అతని గురువు మనకి సహాయం చెయ్యడానికి వొప్పుకున్నారుట."

"అలాగా? శుభం. చాలా శుభవార్త తెచ్చావు శృంగీ" నవ్వాడు జోగి.

"భోజనానికి లేవండి" అన్నది మధుర.

వరుసగా మూడు విస్తళ్ళు వేసి వున్నై. రెండు కూరలు, రెండు పచ్చళ్ళు, వడియాలూ, అప్పడాలూ, కందిపొడీ, ఎర్రని ఆవకాయీ, ముత్యంలా తెల్లగా మెరుస్తున్న అన్నమూ వడ్డించి వుంది. కంచు గ్లాసుల్లో నీళ్ళు.

"రా మట్టూ. లోపలికి రా. భోంచేద్దాం" పిలిచాడు రామజోగి.

"అయ్యా..నేను.." చెప్పబోయాడు మట్టూ.

"అవన్నీ ఇక్కడలేవు. అందరూ సమానమే. రా" అతని చెయ్యిపట్టుకుని లోపలికి లాక్కొచ్చాడు రామజోగి.

నిశ్శబ్దంగా భోజనం చేస్తున్నారు. చక్కని ముక్కలపులుసు సువాసన ఆకల్ని మరింత పెంచింది. కమ్మని నెయ్యి ఆహారపదార్థాలకి మరింత రుచినిస్తోంది.

"కంది పొడితోబాటు, ఆవకాయకూడా కలిపితే రుచి బాగుంటుంది" చిన్న నవ్వుతో అన్నది మధుర మట్టూని చూసి.

"అమ్మా.!" అంటూ ఆమె చెప్పిన విధంగానే కలుపుకున్నాడు అన్నాన్ని. ఆమె మరింత నెయ్యిని వడ్డించింది.

"ఇప్పుడు అందులో ఆ గుమ్మడి వడియాలు మధ్యమధ్యలో నంజుకోండి?" నవ్వింది మధుర.

పులుసు అద్భుతంగా ఉన్నది. ఆ తరవాత వేడివేడి అన్నంలో గడ్డ పెరుగు.

"ఓ చుక్క నీళ్ళు కలుపుకోండి. రాత్రిపూట నీళ్ళు కలపకుండా పెరుగు వేసుకోకూడదు"

"పెరుగన్నంలోకి మాగిన అరటిపళ్ళు కూడా బాగుంటాయి" అంటూ చక్కెరకేళీ పళ్ళని వడ్డించింది.

ముగ్గురి భోజనం పూర్తయింది.

"అమ్మా.! కన్నతల్లి పెట్టినట్టు కడుపునిండా భోజనం పెట్టావు. కొసరి కొసరి వడ్డించావు. దేముడు నిన్ను చల్లగా చూడాలి" చెమర్చిన కళ్ళతో అన్నాడు మట్టు.

చిన్నగా నవ్వింది మధుర.

అరుగుమీద రెండు మడతమంచాలు వేసి వున్నై. వాటిమీద పడుకున్నారు శృంగీ, మట్టూ.

శృంగి ఆలోచిస్తున్నాడు. నిన్న రాత్రి శిథిలాలయపు మండపంలో నిద్ర. సరిగా తినీ తినక. గుచ్చుకునే గడ్డిపరుపుమీద.

నేడు కమ్మని భోజనంతోపాటు మంచం మీద నడుం వాల్చడం. అతి పవిత్రంగా, అత్యంత నియమ నిష్టలతో వుండే రామజోగి యీనాడు ఓ భిల్లునితో సహపంక్తి భోజనం ఎందుకు చేశాడూ? అన్న సందేహం మనసుని ఓ పక్క తొలుస్తోంది. మధురకి రామజోగి దగ్గర చనువు ఎక్కువని తెలుసు. కానీ ఇక్కడ స్వంత ఇంట్లో వున్నట్టు రామజోగి ఎందుకున్నాడూ?

మట్టూ మనసులోనూ ఆలోచనలే. 'మధురలో మూర్తీభవించిన మాతృత్వం వుంది. రామజోగి అగ్నిలాంటివాడని చూడగానే తెలిసింది. అతని నోట అసత్యం రాదని మనసుకి తెలుస్తోంది. కానీ, ఇక్కడ వుంటూనే, అక్కడికి రామజోగి ఎలా రాగలిగాడు? వస్తే రావొచ్చు. కానీ, ఆ ప్రమాద సమయంలోనే ఎలా రాగలిగాడు? అంత నిర్భయంగా ఆ మహానాగుని ఎలా దారి మళ్ళించగలిగాడు. వీరిద్దరూ మామూలు మనుషులు కారు. తనకి అందని శక్తి ఏదో వీళ్ళల్లో తొంగి చూస్తోంది. ఎన్నేళ్ళ తరవాత మళ్ళీ అమ్మ చేతిలాంటి చేతిలో అన్నం తిన్నానూ.! హాయిగా యీ పక్కమీద పడుకోగలనని ఏనాడైనా అనుకున్నానా?

మెల్లగా ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

తెల్లవారింది. మట్టూ అప్పటికే స్నానం చేసి కూర్చున్నాడు. శృంగి వొళ్ళు విరుచుకుని బావిదగ్గరకు వెళ్ళాడు.

రామజోగి పూజ ధ్యానం పూర్తి చేసుకుని అరుగుమీదకి వచ్చాడు.

"అయ్యా... ఇప్పుడేం చెయ్యమంటారూ?" అడిగాడు మట్టూ.

"నువ్వు తిరిగి వెళ్ళినా మీ గురువుగారు అక్కడ వుండరు. ఎప్పుడైతే సహాయం చేస్తానని వారు చెప్పారో ఆ క్షణం నించే వారు నాకు సహాయం చేసే పనిలో వుంటారు. మట్టూ, చాలామంది మాట ఇచ్చి మరిచిపోతారు. లేదా నిర్లక్ష్యం చేస్తారు. దానివల్ల వారెంతటి క్షోభని అనుభవించాలో వారికి తెలీదు. మీ గురువుగారు సాక్షాత్తూ సత్యస్వరూపులు. వారు కోరేది లోక క్షేమం. లోకం దృష్టిలో వారికి ఏభై ఆరు సంవత్సరాలు. కానీ వారి అసలు వయసు లెక్కగట్టడం, ఎవరికి సాధ్యం? అటువంటి మహానుభావుల్ని దర్శనం చేసుకుంటే చాలు. సర్వపాపాలూ తొలిగిపోతాయి. నువ్వు అదృష్టవంతుడివి. వారిని సేవించే భాగ్యం నీకు దొరికింది. ఇహ కర్తవ్యం అంటావా? మనం ఒక చోటుకి వెళ్ళాలి. ఎప్పుడనేది మాత్రం ఇప్పుడు తెలియదు. హాయిగా ఇక్కడే విశ్రాంతి తీసుకో. నవ్వాడు రామజోగి.

"ఫలహారం సిద్ధంగా వున్నది. వొడ్డించనా?" బయటికొచ్చింది మధుర. మట్టూ ఆమెని చూస్తూ రెండు చేతులూ ఎత్తి నమస్కరించి అనుకున్నాడు., "ఇదేమి సౌందర్యం? యీమె దేవతా స్త్రీయా? ఆ కళ్ళల్లో అదేమి కరుణ" అని.

"శృంగిని రానీ మధురా.! ఇదిగో యీ 'మట్టూ' అసలెవరికీ దొరకడు. నీ నేర్పునంతా చూపించి యీ బిడ్డకి రకరకాలుగా వొండిపెట్టు" నవ్వాడు రామజోగి.

"చిత్రం మహాశయా. అక్కడ శృంగి సిద్ధమైనాడు. ఇక్కడ ఫలహారం సిద్దం. దయచేయండి" నవ్వింది మధుర.

రాబీ ఆలోచిస్తున్నాడు, 'కలలోని' విలియమ్స్'ని మరిచిపోలేకపోతున్నానెందుకా' అని. కారు స్పీడుగా పోతోంది. ఏసి చల్లదనం ఆహ్లాదంగా ఉంది. 'పుత్తూర్' అన్నబోర్డు కనిపించింది.

"ఇంకెంతదూరం?" ఇంగ్లీషులో అడిగాడు రాబీ.

"మరోగంట" అమెరికన్ యాక్సెంట్‌తో జవాబిచ్చాడు డ్రైవర్.

"మా అమెరికన్స్‌లా మాట్లాడుతున్నావు" మెచ్చుకోలుగా అని అతని మొహాన్ని అద్దంలో చూశాడు రాబీ. షాక్ అనిపించింది, "హే.. ఎవరు నువ్వు?"

"మై నేమ్ యీజ్ ఏళుమలై..." అద్దంలోంచే రాబీని చూస్తూ నవ్వి అన్నాడు ఏళుమలై. అదే నవ్వు.! అదే కోల్డ్‌లుక్. ఇతను నల్లవాడు.

"వేరార్యూ ఫ్రమ్?"

"నో వేర్. మిస్టర్ రాబర్ట్ వెబ్‌స్టర్" నవ్వాడు ఏళుమలై.

"అంటే? నా పేరెలా తెలుసు?" ఆశ్చర్యంగా అన్నాడు రాబీ.

"మొన్న నిన్ను నీ హోటల్ రూమ్‌లో కలిశాను మిస్టర్ రాబర్ట్. నా పేరు విలియమ్స్ అని చెప్పాను.. గుర్తులేదా?"

"అప్పుడు నువ్వు తెల్లవాడివి. అమెరికన్‌వి.. ఇప్పుడిలా" షాక్‌తో అన్నాడు రాబీ. కారు ఆపాడు విలియమ్స్.

"చెప్పాగా. మళ్ళీ మళ్ళీ కలుస్తానని. రంగు సంగతి మర్చిపో. ఏ రంగైనా నాకు ఒకటే. ఇంకో విషయం విను. నువ్వు నిజంగా అమెరికన్‌వి కాదు. బ్రిటిషర్‌వి. నీ పూర్వీకులు అమెరికాలో సెటిలయ్యారు. కనీసం ఐదువేలమంది వెబ్‌స్టర్‌లు యు.ఎస్.ఎలో వున్నారు" మంచుపువ్వులా నవ్వాడు విలియమ్స్.

"నీకెలా తెలుసూ?"

"ఇంకా చాలా చాలా తెలుసు. బ్రిటీషర్‌వి కాకముందు నువ్వో ఇండియన్‌వి. ఇంకా చెబితే నువ్వో ప్యూర్ బ్రాహ్మిన్‌వి"

"వాట్?" అదిరిపడ్డాడు రాబీ.

"బీ కూల్" కారు స్టార్ట్ చేశాడు విలియమ్స్ "ఈ శరీరం నిజంగా ఏళుమలై అనే తమిళ్‌వాడిది. చూడటానికి నాలాగే వుంటాడు. అందుకే యీ శరీరంలోకి దూరాను. డోంట్ వర్రీ."

"ఎందుకిలా చేస్తున్నావు? అసలు నువ్వెవరు?"

"నీతో నాకు చాలా పనివుంది. ఇకనేనా? నేనో ఆత్మని. నా పని పూర్తయ్యేవరకూ ఏ శరీరంలోనైనా దూరగలను. మొన్న నువ్వు చూసిన రూపం ఒకప్పటి నా శరీరానిది."

"అంటే?"

"చెప్పినా నీకు ప్రస్తుతం అర్థంకాదు. సరే, ఓ గుమ్మడిపువ్వుని చూశావు. కొన్నాళ్ళలో అది రాలి అందులోనించి కాయ వస్తుంది. కాయపండుతుంది. ఆ పండులో గింజల్ని మళ్ళీ భూమిలో నాటితే గుమ్మడి తీగపుడుతుంది. మళ్ళీ పువ్వులు...మళ్ళీ కాయలూ.. మళ్ళీ పళ్ళూ విత్తనాలు అవునా?"

"అవునూ. అయితే?"

"పువ్వు ఏమైపోయిందీ? కాయకాయలానే ఎందుకులేదు. కాయపండుగా ఎందుకు మారిందీ? అది ఎండి మళ్ళీ గింజల్ని ఎలా మొలకెత్తించిందీ? ఇవన్నీ ప్రశ్నలు. వీటికి సమాధానాలు వెతుక్కో. అలాగే నిన్ను గురించి కూడా నువ్వు ఆలోచించుకో. నీలోని 'శిశువు' ఏమయ్యాడు? నీలోని 'బాలుడు' ఏమయ్యాడు? ఇప్పుడు నీలోని 'యువకుడు' ఏం చేస్తాడూ? ఏమౌతాడూ?"

"వయసుతో పాటు పెరిగాను కనక శిశువు బాలుడయ్యాడు బాలుడు యువకుడయ్యాడు. ఎవరైనా అంతేగా? వింతేముందీ?"

"మిస్టర్ రాబీ.! తొందరపాటు సమాధానాలు ఎందుకిస్తావూ? ఆలోచించు "నిజంగా అనుభవించిందీ అనుభవిస్తున్నదీ పెరిగిన నీ శరీరమేనా? అసలు శరీరం అనేది దేన్నైనా అనుభవించగలదా? తరచి చూసి తర్కించుకో."

"ఫ్లైట్‌లో నా పక్కన కూర్చున్న ఇండియన్ సెయింటూ ఇలాగే మాట్లాడాడు. నువ్వూ అదే అంటున్నావు. వాటీజ్ దేర్ టూ థింక్? నేను మనిషిని. మనిషిగానే బ్రతుకుతున్నాను. మిగతా మనుషుల్లాగే అనుభవాల్ని సంతరించుకుంటున్నాను. అసలు నువ్వెవరో, నాతో నీకు పనేంటో నువ్వు చెప్పేది నిజమో కాదో.. ఎలా తెలిసేది. ఇదంతా ఓ ట్రాష్. కేవలం నా భ్రాంతి. నథింగ్ ఎల్స్" చికాగ్గా అన్నాడు రాబీ. మొత్తమంతా మూర్ఖత్వంగా అనిపిస్తోందతడికి.

ఏదో ఓ కల. ఆ కలని 'జయ్'కి చెప్పటం జరిగింది. జయ్ యీ నల్లోడికి చెప్పివుంటాడు. అందుకే వీడు నన్ను కన్ఫ్యూజన్‌లో పెట్టి నానా కథలూ చెబుతున్నాడు. వీళ్ళ వేదాంతం ఎవడిక్కావాలి? తన ప్రశ్నలూ ప్రవర్తనా తనకే చికాకు తెప్పించాయి.

"ఓ..కె..ఓకె.. బీ కూల్. ఇక్కడ కారు ఆపుతా. ఇక్కడ్నించి యీ ఏళుమలై నిన్ను నీ హోటల్‌కి తీసుకెళ్తాడు. గుడ్‌బై మిస్టర్ రాబర్ట్" కారు ఓ జర్క్‌తో ఆగింది. ఏళుమలై తల విదిల్చుకున్నాడు.

"సారీ సార్. సడన్‌గా కళ్ళు తిరిగినై" తమిళ్‌లో అన్నాడు ఏళుమలై గేరు వేస్తూ.

"ఇంకెంతసేపూ?"

"వచ్చేశాం సార్. ఇంకో పావుగంట" బ్రోకెన్ ఇంగ్లీషులో తమిళ యాసతో అన్నాడు ఏళుమలై.

రాబీకి ఆశ్చర్యంతో నోటిమాట పెకల్లేదు.

"వేరార్యూఫ్రం?" మళ్ళీ డ్రైవర్నడిగాడు రాబర్ట్.

"మద్రాస్ సార్. పుట్టిందీ పెరిగిందీ ఇక్కడే"

తమిళ ఇంగ్లీషులో అన్నాడు ఏళుమలై.

రాబర్ట్ సైలెంటైపోయాడు. ఇదెలా సాధ్యం?

"యూ ఆర్ గోయింగ్ టూ ద లాండ్ ఆఫ్ మిరకిల్స్" ఇదీ రాబీ గాళ్‌ఫ్రెండ్ నికోల్ అన్నమాట. ఏర్‌పోర్ట్‌లో దించుతూ.

"అంటే?" అన్నాడు తను.

"ఇండియా గురించి నేను చదివింది అదే. పరమహంస యోగానంద ఆటో బయోగ్రఫీ చదివితే నాకలాగే అనిపించింది. జిడ్డుకృష్ణమూర్తిగారి ఉపన్యాసాల 'టేప్'లూ విన్నాను. లివింగ్ విత్ ద మాస్టర్స్ ఆఫ్ హిమాలయా కూడా

చదివాను. ఆ దేశంలో మనకి తెలియనిది ఏదో ఉంది రాబీ! మేబీ!. వన్ డే ఐ విల్ విజిట్ ఇండియా" అని నికోల్ జవాబిచ్చింది.

జరిగిందంతా నికోల్‌కి చెప్పాలని నిర్ణయించుకున్నాడు రాబీ.

"వచ్చేశాం సార్! అదే మయూరా" కారు ఆపాడు ఏళుమలై. కాదు దిగి డిక్కీ ఓపెన్ చేసి రాబీ సామాన్లు తీసుకుని లాంజ్‌లో పెట్టడానికి మెట్లెక్కుతున్నాడు ఏళుమళై. సరిగ్గా విలియమ్స్ హైటే. అంతే లావు వున్నాడు. తేడా కేవలం రంగే.

"వెల్ కమ్ టు తిరుపతి మిస్టర్ రాబర్ట్ వెబ్‌స్టర్! ఐ యామ్ శ్రీనివాస్. యువర్ గైడ్" నోరారా నవ్వుతూ రాబీని పలకరించాడు శ్రీనివాస్.

"థేంక్స్ మిస్టర్ శ్రీనివాస్" కరచాలనం చేశాడు రాబీ.

"మీరూమ్ రెడీగా ఉంది. రండి వెళ్దాం."

ఇద్దరూ రూమ్‌లో కూర్చున్నారు. లోపలికి వెళ్ళేముందే తిరుమల 'హిల్స్' వ్యూ హోటల్ వరండా చివరవున్న గ్లాస్ విండోలోంచి రాబీకి చూపించాడు శ్రీనివాస్. ఆ కొండల్నీ నామాన్నీ చూశాక ఏదో ఓ తెలియని అలజడి కలిగింది రాబీకి.

"ఇక్కడ గత జన్మల గురించి చెప్పే ఒకాయన వున్నారనీ, ఆయనకి 96 ఏళ్ళ వయసనీ జయదేవ్ చెప్పారు. ఆయన ఆచూకీ తెలియాలన్నా తిరుపతిలోనే తెలుస్తుందనీ, ఆయన శిష్యుడు ఒకాయన ఇక్కడ వున్నారనీ కూడా అన్నారు. ఎనీ ఐడియా?" డైరెక్టుగా శ్రీనివాస్‌ని అడిగాడు రాబర్ట్.

"నాకు తెలీదు సార్. రేపు జయదేవ్‌గారిని కనుక్కోవలసిందే" నవ్వాడు శ్రీనివాస్. "అయినా, మీకు గత జన్మల మీద నమ్మకం వున్నదా?"

"ఐ డోంట్ నో ఎగ్జాట్లీ ఉన్నదని ఖచ్చితంగా చెప్పలేను కానీ, తెలుసుకోవాలనే ఉత్సాహం లేదని మాత్రం అనను. ఈ గత జన్మల ప్రస్థావన ఇప్పటికి రెండుసార్లొచ్చింది."

"ఎలా?" అడిగాడు శ్రీనివాస్.

చాలాసేపు చెప్పాలా వద్దా అని ఆలోచించాడు రాబర్ట్. చెప్పటం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదనుకుని, గ్రాండ్ స్పెన్సర్ హోటల్లో విలియమ్‌తో మాట్లాడటం, అదే విలియమ్ ఆత్మతో కార్లో మాట్లాడటం గురించి వివరించాడు.

"ఓహ్! థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్. భ్రమ అని మాత్రం నేను అనుకోను ఆత్మల్నీ ఆత్మ శక్తినీ మేం నమ్ముతాం. కొన్ని పుణ్యాత్మలు వుంటాయనీ అవి మనుషులకి సాయం చేస్తాయనీ, అలాగే పాపాత్మలు మనుషులకి కీడు చేస్తాయనీ కూడా నమ్ముతాం. అయితే యీ రెండురకాల ఆత్మలతోటీ నాకెటువంటి పరిచయ భాగ్యమూ ఇప్పటిదాకా కలగలా" నవ్వాడు శ్రీనివాస్.

"ఒకవేళ విలియమ్‌లాంటి ఆత్మ పరిచయమైతే?"

"ఆవాళ మీ పరిస్థితిలో నేనుంటే నా గుండె ఆగిపోయుండేది. నేనేం పెద్ద ధైర్యస్థుడ్నిగాను. ఒకవేళ విలియమ్మే కాస్త చిరునవ్వుతో నా దగ్గరికొచ్చి, హలో శ్రీనివాస్, నేను విలియమ్స్‌ని. అంటే, ఓ ఆత్మని.. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ" అంటే మాత్రం సంతోషించి, నాకు కావల్సింది అడుగుతానేమో."

గలగలా నవ్వి అన్నాడు శ్రీనివాస్.

"అలాగే జరిగితే బహుశా నాది భ్రాంతికాదనీ, యీ విలియమ్స్ అనే ఆత్మ నిజంగా వున్నదనీ నమ్మగలనేమో" సాలోచనగా అన్నాడు రాబర్ట్.

"ఆశిద్దాం సార్. తప్పులేదు కదా!"

"సరే నిజంగా అదే జరిగితే ఏం కోరుకుంటావూ?" నవ్వాడు రాబర్ట్.

"నాక్కాస్త టైమ్ కావాలి. ఎందుకంటే, కోరుకునేది మామూలు వాడ్ని కాదుగదా. ద గ్రేట్ విలియమ్స్‌ని. సో. ఏదైతే అసాధ్యమో అది కోరతాను. మనిషికి సాధ్యం కానివి ఆత్మలకి సాధ్యమౌతాయేమో పరీక్షిస్తాను" యీసారి ధృడంగానే అన్నాడు శ్రీనివాస్.

"ఓకె. ఇప్పుడేం చేద్దాం?"

"ఛాయిస్ మీదే. తెలుగు సినిమా చూద్దామా? అద్భుతంగా ఉంటుంది. మీ అమెరికన్ సినిమాలూ బ్రిటన్ సినిమాలూ ఎందుకూ పనికిరావు. బోలెడన్ని పాటలుంటై.. ఫైట్సుంటై. డబుల్ మీనింగ్ డైలాగ్సుంటై.. పోదామా?" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాస్.

"నాట్ నౌ ఎనీ వే! ఓ పని చేద్దాం. ఓ 'కేబ్' మాట్లాడుకుని చుట్టుపక్కలుండే ఊళ్ళు చూద్దాం. సరేనా."

"యస్ మిస్టర్ రాబర్ట్. ఊళ్ళతో పాటు 'తలకోన' చూపిస్తాను. ఆ ప్రాంతాన్ని చూస్తే మళ్ళీ మీరు వెనక్కి వస్తానని అనలేరు. అంత అద్భుతంగా ఉంటుంది. ప్రకృతి సమకూర్చిన ప్రాణవాయువు (ఆక్సిజన్) ఫేక్టరీ అది" మహోత్సాహంగా లేచాడు శ్రీనివాస్.

"అలాగే మధ్యాహ్నం లంచ్‌కి కూడా ఏమైనా పేక్ చేయించు. అప్పుడైతే అక్కడ ఎంత సమయం గడిపినా ఇబ్బంది వుండదు"

"డోంట్ వర్రీ సార్. వెస్ట్‌నీ ఈస్ట్‌నీ కలిపే సూపర్ ఫుడ్ పేక్ చేయిస్తా. ఐదే నిముషాల్లో కారు రెడీగా వుంటుంది."

రాబర్ట్‌ని గదిలో వదిలి బయటకి పరిగెత్తాడు శ్రీనివాస్.

"జయ్ చెప్పింది అక్షరాలా నిజం. యీ కుర్రాడు వెరీ షార్ప్ అండ్ హంబుల్" అనుకున్నాడు రాబర్ట్. శ్రీనివాస్ గురించి.

బాత్‌రూమ్‌లో కాస్త ఫ్రెషప్ అయి బెడ్ రూమ్‌లో వున్న మిర్రర్ ముందు నిలబడ్డాడు రాబర్ట్.

దువ్వెన్నలతో దువ్వుకోవడం అతనికి అలవాటు లేదు. చక్కని వొత్తైన 'పొగ' (smoky) రంగు జుట్టు అతనిది. వేళ్ళతో సవరిస్తే అద్భుతంగా 'సెట్' అవుతుంది. వేళ్ళతో జుట్టుని సవరించుకుంటుంటే సడన్‌గా 'విలియమ్స్' అద్దంలో కనిపించాడు రాబర్ట్‌కి.

"నువ్వు..!" షాక్ తిని అడిగాడు రాబర్ట్.

"యస్..! నేనే" నవ్వాడు విలియమ్స్.. కోల్డ్‌స్మైల్..

"సో..! యూ వాంట్ మీ టూ మీట్ దిస్ ఇండియన్?" మళ్ళీ నవ్వాడు విలియమ్. ఛిల్లింగ్ స్మైల్.

సడన్‌గా రాబర్ట్‌కి కళ్ళు తిరిగినట్టై బెడ్ మీద వాలిపోయాడు. తలంతా దిమ్మగా పోటు. మోకాలిమీద.. చల్లగా.. అతి చల్లని ఓ హస్తం వాలినట్టుగా...

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments